


చాలా రోజుల తర్వాత సుబ్బారావు కనిపించాడు. వాడూ నేనూ చిన్నప్పుడు స్కూలుఫైనలు వరకూ చదువుకున్నాం. పైకి నిండుకుండలా కనిపించినా వాడి హృదయం ఎంత మధన పడుతూందో ఓనాడు వాడే స్వయంగా విప్పిచెప్పేదాకా నాకర్థంఅవలేదు. ఓసారి మేం కాఫీహోటల్లోంచి యివతలకొచ్చి సిగరెట్లు కాల్చుకొంటూండగా మా ముందునుంచి ఓ పెద్దగుంపు వెడుతోంది.

"మేష్టారూ, ఆ పోలీసులు పట్టుకున్నది ఎవర్నుకున్నారూ? మురళీనండీ. సంత

అవసరాల రామకృష్ణారావు




నాడు ఎవరిదగ్గరో పర్సుకొట్టేసి పారిపో తూంటే పట్టుకున్నారుట ।" అన్నాడు ఓ కుర్రాడు సుబ్బారావు దగ్గరకొచ్చి ఆ పట్టుబడ్డ కుర్రాడు అతన్ని చూడగానే ఆగమని పోలీసుల్ని బ్రతిమాలి, ఏడుస్తూ సుబ్బారావు కాళ్ళమీద పడ్డాడు

"తిన్నయింటికే కన్నంవేసిన దుర్మార్గుణ్ణి, నన్ను క్షమించకండి మేష్టారూ. మీరునన్ను బాగుచేద్దామనే చేశారు ఈ పనికిమాలిన వెధవ్వకే బాగుపడే యోగం లేదు మీరెంతో మంచివారు దేవుడి లాంటివారు"

ఇంకా ఏదో అంటూంటే వాణ్ణి పోలీసులు లాగేశారు నేను సుబ్బారావు మొహంచూశాను సర్వస్వమైన దేనినో కోల్పోయినట్టు యిపోయింది వాడి మొహం ఉత్తమమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవాడికి కలిగిన ఉపద్రవ మేమిటో నా కర్థమవలేదు

"వాణ్ణికాదు నన్ను అరెస్టుచేస్తే బావుణ్ణు ఆ పోలీసులు" అన్నాడు వాడు

"అదేం ?" అని నే నడిగేలోగా వాడే చెప్పడం ప్రారంభించాడు

* * *

"అవును సరిగా ఏణ్ణర్థం క్రితం ఆ ముసిలావిడ నన్ను కలుసుకోడానికి వచ్చింది వచ్చినపని చెప్పక డబ్బ

సంపాదించటానికి ఆవిడ పడిన అవస్థలు చెబుతూంటే నాకు విసుగనిపించలేదు. తన వంటిమీద పాకుతున్న చీమల్ని ఏరి తీసి అవతలపారెయ్యలేనంతగా కంటి చూపు దెబ్బతిన్న ముసిలాళ్ళుకూడా ఓ గోనెమీద నాలుగు వేరుశనక్కాయల కుప్పలు పెట్టుకుని ఓ పావలా డబ్బులు కోసం పొద్దుట్నుంచి సాయంకాలం దాకా కూచోడం నాకు తెలుసు. అరవై మైళ్ళ స్పీడులో వెడుతున్న రైల్లో అరటిపండ్ల సజ్జతో ఈ పెట్టినుంచి ఆ పెట్టిలోకి ఒకేచెయ్యి వున్నవాళ్ళు దాటడం నాకు తెలుసు. అయిదురోజులు ఆగకుండా సైకిలు తొక్కేవాళ్ళూ, మంటలనూతిలో మోటారు సైకిలు తొక్కేవాళ్ళూ నాకు తెలుసు. ఏం చేస్తాం ? కడుపుమండిన భారతికథ అలాంటిది.

"మేష్టరుగారు ఏదో ఆలోచిస్తున్నారు కాబోలు, ఈ ముసిల్ది సొంత పురాణం విప్పిందని...అసల్నేను ఎందు కొచ్చానో అది చెబుతాను, వినండి ... వి. మురళీ ధరరావు—ఫోర్తు ఫారం 'ఏ' లో మీ స్కూల్లోనే చదువుతున్నాడు. ఆ కుర్రాడు మీకు గుర్తున్నాడా? పొడుగ్గా బక్క పల్చగా ఉంటాడు..."

"ఊఁ" అని అబద్ధం ఆడేశాను నేను.

ఈ ఇరవై ఏళ్ళ ఉపాధ్యాయ వృత్తిలో కొన్ని వేలమందికి నేను పాఠాలుచెప్పేను. ఎవరెవరో ఎవరికి జ్ఞాపకం ? ఆమధ్య మా పెత్తల్లికి ఆపరేష నయిందని విశాఖపట్నం వెళితే ముద్ద నందివర్ధనాల్లా ఉన్న ఇద్దరు నర్సుముద్ద రాళ్ళు నన్నుచూసి "నమస్కారమండీ" అన్నారు నవ్వుతూ. వాళ్ళు నా యక్స్ స్టూడెంట్స్, నా వేషం, రూపం చూసి నవ్వడానికి అవతరించిన యక్షకన్యలో యిప్పటికీ నాకు అనుమానమే...

"ఆ మురళీగాడు నాకు మనవడు, అంటే మా అమ్మాయి కొడుకు. నాకు కొడుకుల్లేరు. అందుకని మా మొగాయిన పోగానే ఆ చిన్న కొంప అమ్మేసి అప్పులు తీర్చేసి ఏకంగా యీ వూరు మా అల్లుడుగారింటికి వచ్చేశాను. నే నొచ్చిన ముహూర్తం అటువంటిది. భూదేవతలాంటి నా కూతుర్ని ఏడాది తిరక్కుండా పొట్టనెట్టుకున్నాను బాబూ..."

ముసిలావిడ కళ్ళనీళ్ళు తుడుచుకుని మళ్ళీ ప్రారంభించింది.

"మా అల్లుడు అసలే తాగుబోతు ... ఉన్నన్నాళ్ళూ గొడ్డుని బాదినట్టు బాద డమేగాని నిజానికి నా కూతుర్ని ఏం సుఖపెట్టి చచ్చాడు గనక ? ఇంట్లో ఆయుర్దాయం చెల్లని పాపిష్టిముండని నేనొకర్తిని చాకిరీకి ఉన్నాను గనక గాని మూణ్ణెమషాల్లో ఆ పుట్టిన గుంటవెధవని ఏ అనాథ శరణాలయానికో అప్పజెప్పి రాక పోనా ?..."

ఆవిడ కాస్సేపు ఆగి,

"ఏమిటో అన్నీ తెలిసినట్టు కబుర్లు చెబుతాం, అలా నా అల్లుడు ఆనాడు చేసినా నా మనవడు యింతకంటె బాగుపడి వుండునేమో !"

"ఏం, యిప్పుడొచ్చిన యిబ్బం దేమిటి ?"

"ఈ లక్షణాలకి తోడు—కట్నండబ్బు కాశించి నా పిల్లపోయిన ఆర్నెల్లు తిర క్కుండా మా అల్లుడు మరో కుఱ్రదాని గొంతుక కోశాడు ... చెప్పేదేమిటంటే అన్ని విధాలా మా మురళీ చదువు పాడయింది బాబూ''

ఆవిడ ఒక నిట్టూర్పు విడిచింది.

"బతికిచెడిన జాతిమాది. రెంటికీచెడ్డ రేవళ్ళం మేము. ఆనాటి అగ్రహారాలూ లేవు, ఈనాడు అడుక్కు తిననూలేము" ముసిలమ్మ చాలా బాధపడుతూ ఆ మాట లన్నట్లు అనిపించింది.

"ఇంటి యజమాని అయిన మొగాడు పచ్చిజూదరీ, పరమ తాగుబోతూ అయి నప్పుడు—సవిత్తల్లిని దాన్ని అనుకోడం దేనికిలెండి ?

కన్నతండ్రికేలేని బాధ్యత మారుటి తల్లికి ఎక్కణ్ణుంచి వస్తుంది ? మా అల్లు డికే వాడు తిన్నాడో ఉన్నాడో అక్కర్లే నపుడు వాడి చదువూ సంధ్యా పూచీ ఆవిడకా పట్టింది, చెప్పండి ?"

"అయినా కుఱ్రాడు అదృష్టవంతుడే ఒకవిధంగా...నువ్వుకూడా లేకుండా ఉంటే వాడి బతుకేంగాను ? వాడికి తగిన విద్యా, బుద్ధీ...''

"అవి రెండే వాడికి చెప్పించలేక పోయాను బాబూగారూ నేను ... మా కుటుంబంలో ఒకరూ సరిగ్గా చదువుకున్న వాళ్ళయారుకాదు...

''మురళీగాడు పలకా పుస్తకాలూ పట్టు కొని బళ్ళోకెడితే చూడాలని ఉందే అమ్మీ' అనేవారు ఆయన ఆఖరి రోజుల్లో...ఆ కోరిక తీరకుండానే ఆయన కన్నుమూశారు. వీడు ఆఖరికి బంట్రోతు పని చేసినా చూచి ఆనందించాలని ఉంది నాకు...నా కోరిక కూడా తీరేలాలేదు.''

నేను కాస్సేపు ఆలోచించి అన్నాను.

"ఏం, మీకున్న పరిస్థితుల్లో మీరు మీ మనవడికేం తక్కువ చేసినట్టు నాకేం కనపడంలేదు ! కుఱ్రాడు ఫోర్తుఫారం చదువుతున్నాడుగదా, అంతకంటె ఎవ రయితే మాత్రం ఏం చెయ్యగలరు ! ఆ లెక్కని మా పిల్లలయితే ఒక మెట్టు కిందనే ఉన్నారు మరి..." నా మాటలకి ఆవిడేం ఉపశమనం పొందినట్టులేదు. పైగా అలాంటి సమాధానం కోసం ఆవిడ వచ్చినట్టూలేదు !

"బాబుగారు మా మురళీగాడి డివిజనుకి వెళ్ళరనుకుంటాను...వాడు ఫోర్తుఫారం రెండోఏడు చదువుతున్నాడు...ఆ మాట అలాఉంచి వాడు రోజూ ఒకటిరెండు పిరీడ్లుతప్ప స్కూల్లో ఉండనే ఉండడు!"

నేను మురళీగాడి డివిజనుకి వెళ్ళకేం, లెక్కలుకి వెడతాను. వెడితే మాత్రం ఎవడికి జ్ఞాపకం? ఇరవై నాలుగు గంటల కాలపరిమితిగల రోజులో ఒక టీచరు దగ్గర ఒకవిద్యార్థి మహాఉంటే నలభై అయిదు నిమిషాలు ఉంటాడు. ఈ విధంగా చూస్తే ముప్పైరెండు పాళ్ళలో ఒక పాలుకి మాత్రమే బాధ్యుడైన ఉపాధ్యాయుణ్ణి కుర్రాడి పూర్తి మంచిచెడ్డలకు జవాబు చెప్పమనడం ఏరకం న్యాయం గనుక! అయినా ఈ ముసిలావిణ్ణి అనుకోవడం దేనికి? ముగ్గురు పిల్లల్తో సంసారాన్ని పరిమితం చేసుకోమని ఇంచుమించు ఆంక్షవిధిస్తున్న ప్రభుత్వం ముప్ఫైమందికే క్లాసుసంఖ్యను ఎందుకు పరిమితం చెయ్యమనదు? ఈ అతి ముఖ్య విషయం ఏ విద్యాభ్యుదయ సంఘం కళ్ళపడదా? దిగజారిపోతున్న విద్యావిధానం గురించి చర్చించడానికి నియమించినకమిటీల్లో కష్టం సుఖం పూర్తిగా వంటబట్టిన—ఏ ఎలిమెంటరీ స్కూలు టీచర్నో ఏ హైస్కూలు టీచర్నో ఎందుకు నియమించరు?

"సరే లేవమ్మా... నేను రేపు వాణ్ణి వేరే పిలిపించి కేకలేస్తాలే... నువ్వు కూడా వాణ్ణి మరికాస్త జాగ్రత్తగా కనిపెట్టిఉండు. వీలయితే మీ అల్లుణ్ణి ఒకసారి యిక్కడికి పంపు. గట్టిగా చెబుతాను. ఇంటిదగ్గర ఉన్నప్పుడు మాత్రం పుస్తకం ముందేసుకు కూచోపోతే చావగొట్టు.''

"లాభంలేదు బాబూ అలా ఏం లాభంలేదు...'' అంది ఆవిడే. అంతావిని అదేమని అడిగేశ్రమ నాకు తగ్గించి ఆవిడే చెప్పేసింది.

''చెప్పేనుగా మా యింట్లో మొగాడి దక్షతేలేదని...ఇక ఇంట్లో వాడిసవిత్తల్లి కావమ్మ పెత్తనం. ఇంత కీఆ వెధవకిబాగు పడాలనేజ్ఞానం కొంచెమయినా ఏడుస్తేగా! దానిమాటే వింటాడుగాని నా మాట చెవిని పెట్టడా వెధవ. ఇంక దానికి వీడు జీతంలేని నౌకరు. పిల్లల్ని ఆడించమనో, బజారుకెళ్ళి రమ్మనో ఏదో ఒకపని మీద పని పురమాయిస్తూ ఉంటుంది. నా నుంచి వీధిలోపడ్డమే వాడికి కావలసింది. పైగా సామాను తెచ్చేటప్పుడు ఓ అర్ధణావో అణావో కమిషన్ కొట్టొచ్చు... దానికి వాడిబాగుఅక్కర్లేదు. వాడికే వాడి బాగు అక్కర్లేదు. నేనెంతకని చావను?'

"అయితే మధ్యని నేనేం చెయ్యమన్నా?'' అన్నాను విసువుగా కోపంగా లేచి.

"బాబూ, పదిమందిని బాగుచేసే వాళ్ళు... క్షమించండి... కోప్పడక నా మాట వినండి. రేపు... దశమి మంచిది... కుర్రాణ్ణి మీ దగ్గర ప్రైవేటుకి పంపిస్తాను. నే నామాట చెప్పడానికే వచ్చాను?"



"మీ మామయ్య చచ్చిపోయేముందు మతిస్థిమితం అంతా బాగా ఉన్నాయా ?"

"ఏమో చెప్పలేను. రేపు విల్లుచూసిన తరువాత చెప్పగలను.''

---

నేను ఆశ్చర్యపోయాను. ఈ దిక్కు-మాలినదాని మనవడికి ప్రైవేటు ఒకటా ? ఊరికే చెప్పమని కాళ్ళా వేళ్ళా పడ్డానికి వచ్చింది కాబోలు, బాగుంది !

"లేదు బాబూ లేదు. మునపటోపిక లేదు. రెండిళ్ళలో వంట చెయ్యడమే కాకుండా ఆ వీధివీధంతా మంచినీళ్ళు పోసేదాన్ని.. ఇప్పుడీ దరిద్రగొట్టు ఆయాసం నన్ను లేవనియ్యడం లేదు బాబూ ... అయినా ఆ మాత్రం వంటయినా చేసిపెట్టకపోతే మా కావమ్మ నాకూ మనవడికీ యింత తిండికూడా పెట్టదు ... కిందటేడుదాకా ఎలాగో లాగించాను ... ఈ ఏడు మురళీ పరీక్ష తప్పిపోడంనుంచి పూర్తి జీతం కట్టవలసివచ్చి చాలా చిక్కుల్లోఉన్నాను బాబుగారూ...''

"అయితే ఏమంటావ్ ?''

''మీరు నెలకి పదిరూపాయలు పుచ్చుకుంటారుట, పిల్లలు అనుకుంటూంటే విన్నాను. బీదముండ కూతుర్ని. అంత వరకు యిచ్చుకోలేను, ఎలాగో ఓ అయిదు రూపాయలు సద్దుతాను..."

ఆవిడ కొంగు ముడి విప్పింది.

''అంటాను గాని మళ్ళీ నా చేతిలోనే డబ్బు నిలవదూ... మొన్న బీ డీ వో గారింట్లో పెళ్ళికి సాయం చెయ్యమని

కబురంపితే వెళ్ళి పై పనులు చేసిపెట్టేను. అయిదు రూపాయ లిచ్చారు. ఇదిగో... ముందు నెలకి యిచ్చేస్తున్నాను...తీసు కోండి బాబూ...''

కష్టజీవి అయిన ఆవిడ దగ్గర కష్ట జీవినయిన నేను ఆసొమ్ము తీసుకోడం చాల కష్టమనిపించింది. అయినా ఆవిడ ఆసొమ్ము ఎంత మాత్రం తిరిగి పుచ్చుకో లేదు. సొమ్ము తీసుకోకుండా చెబితే సొమ్మిచ్చే వాళ్ళతో సమానంగా చెప్ప ననుకుందో ఏమో.

ఆవిడ వెళ్ళిపోతూ అన్నముక్కలు మాత్రం మరిచిపోలేను :

''బాబూ మేష్టరుగారూ, పశువులాటి వాడు వాడు ... మనిషిని చెయ్యండి''

ఆ సాయంకాలమే మా పెద్దాడిచేత వాణ్ణి కబురంపించాను. ఎన్నో నీతులు చెబుదామనుకున్నాను. కాని చిత్రం నా నోరు పెగల్లేదు. నామనసు అప్రయ త్నంగా వాణ్ణీ, ప్రక్కననిలబడ్డ మావాణ్ణీ పోల్చింది. వాడికి శుభ్రంలేదు. మావాడి కుంది. వాడికి డబ్బులేదు, వీడికుంది. వాడికి బుద్ధిలేదు, వీడికుంది. వాడికి అమ్మలేదు, వీడికుంది ! ఈ ఆఖరిమాటకి త్రుళ్ళిపడ్డాను నేను. ఎడంచేత్తో గుండెను తడుముకున్నాను. జేబులో పర్సుతగి లింది. అందులో ఆవిడిచ్చిన అయిదు రూపాయలు ఉన్నాయన్న భావంతో పర్సు బస్తాఅంత భారం తూగింది. వెంటనే "ఒరే మురళీ, నాతోరా నీకు లాగూ చొక్కా కొంటాను. అలాకొన మని మీ అమ్మమ్మ నాకు డబ్బిచ్చింది" అని రెడీమేడ్‌షాప్‌కి లాక్కెళ్ళాను. పైన రెండున్నర నాదేపడింది ! ఆ రెండోనెల అయిదురూపాయలు పంపుతే 'ఈ సారి డబ్బుగనక పంపుతే కుర్రాణ్ణి గుమ్మం లోకి రానియ్యనని' తిరకొట్టేశాను.

*   *   *

వాడి క్వార్టర్లీ లెక్కల పేపరు నేను దిద్దడం సంభవించింది. ఆ పేపరుచూసి నాకు నోటమాట రాలేదు. వాడికి నూటికి అయిదొచ్చాయ్. మరచెంబు పట్టుకుని గదిలోకి వచ్చిన మా అన్నపూర్ణ నా మొహంలాగే ఉన్న ఆ తెల్లకాగితాన్నీ- ఆ తెల్లకాగితంతో సమానమయిన నా మొహాన్నీచూసి పకపక నవ్వింది.

"బాగుంది, మేష్టర్లంటే కప్పావిప్పా సమర్థులు. లేకపోతే ఏటా ఇంత ముడి సరకు పైకెలా ఎగుమతి అవుతోంది గనక? దానికింత ఆలోచన దేనికి, అయిదు పక్క సున్నాచేరిస్తే సరీ !

"ఇలా ఎన్నాళ్ళని తొయ్యగలం ?''

''సాగినన్నాళ్ళు ... ఇది చెట్టు కాదుగా ! అయినా వాడొచ్చి యింకా మూణ్ణెల్లు పూర్తికాలేదు. ముందుముందు మరింత శ్రద్ధ తీసుకుని చెబితే సరీ"

*   *   *

అవాళ రాత్రి వరండాలో కూచుని పిల్లలికి చదువు చెప్తున్నాను. విద్య మనో వికాసాని కయినా కాకపోయినా ఉదర

పోషణార్థం తప్పనిసరి అని 'ఎప్పుడైతే గ్రహించబడిందో అప్పుడే దాని నైతిక విలువ చచ్చింది. అందుచేత యిప్పుడు నేర్చుకుంటున్నదీ నేర్పబడేదీ లక్ష్మిగాని సరస్వతి కాదు. 'మంచి ఉద్యోగం ఇప్పించండి' అంటారుగాని 'మా అబ్బాయికి కాస్త వాక్శుద్ధి ఉండేలా చూడండి' అని ఏ నిర్భాగ్యుడూ అనడు. అ ఆ లు రాని వాడికయినా డబ్బుంటే పిల్లనిస్తారు గాని 'ఫలానా అబ్బాయి పాపం బీదవాడేగాని గొప్ప విద్వత్తు ఉంది' అని ఎవరూ పిల్లనివ్వరు. నాకు తెలిసినంతవరకు 'ఉపాధ్యాయవృత్తి' చేసిన తండ్రు లెవరూ తమ పిల్లలికా 'వృత్తులలో పరమ పవిత్రమైన వృత్తి' చెప్పించినట్టు కనబడదు. బిల్లుకలెక్టరు ఎనిమిదో కూతురయినా బియ్యేడీని చేసుకోడానికి ముందుకురాదు. విద్యనేర్పినవాడు వింతపశువు క్రిందా పరీక్ష ప్యాసుచేయించినవాడు పరమ దయాళువుక్రిందా పరిగణింపబడడం అతి సహజమైన విషయంగామారింది. విలువ చెడిన భారతికథ అలాంటిది!

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ట్యూషను అడ్డుకోతపటం మీ ముందుంచి అందులో భాగాలు 'ఎక్స్‌ప్లెయిన్' చేద్దామని. పిల్లలికి చదువు చెప్పడానికి తల్లిదండ్రులకి తీరిక ఉండదు. తల్లికి వంటపనితోనూ తండ్రికి ధనసంపదతోనూ తీరిపోతుంది, ఇంకా టైముఉంటే దొంగపూజలతో సరిపోతుంది. ఇతర 'చెడుదుర్లవాట్లున్న' తలిదండ్రులయితే పిల్లలు యింట్లోవుండి వాళ్ళని 'వాచ్' చెయ్యడం యిష్టంఉండదు. పిల్లలు రెండుపూట్లా తలిదండ్రుల్ని 'స్వేచ్ఛగా' బతకనియ్యడానికి స్కూలుకీ ఆటకీకాక ఇంకెక్కడికి పోతారుమరి? ఒకటేదారి. ట్యూషన్‌కి. 'నెలకోపది రూపాయలు ఆ పిల్లలవాడి మొహాన్నికొడితేసరి' అనుకుంటారు. ఎందరు పిల్లల్నిపెడితే అన్ని పదులు జరిమానా. యాన్యువల్ పరీక్షలయిన మరుక్షణంనుంచి మీ యిల్లు నిండిపోడానికి తప్ప అంతకుముందు 'ప్రోగ్రెస్ రిపోర్టు' గురించి ఆసక్తి చూపడానికి గాని 'పేరెంట్సు ఎసోసియేషన్'కి హాజరు అవడానికిగాని ముందుకురారే! అంటే యిలాంటి కలసిరాని విషయాల్లో టైం వేస్టుచెయ్యడానికి తల్లిదండ్రులకు తీరిక ఉండదన్నమాట.

ఈ ప్రయివేట్లు కేవలం రుణసంబంధమని నా నమ్మిక. నిజం ఒప్పుకుంటున్నందుకూ నాకు థేంక్సు చెప్పుకోండి.

లెక్కలు సరిగారానందుకు మురళిని నాలుగు చివాట్లుపెట్టి పన్నెండునుంచి ఇరవైవరకు ప్రతిఎక్కమూ ఇరవై అయిదేసిసార్లు యింపోజిషను రాయమన్నాను. ఓ అరగంటసేపు అది అయిష్టంతో రాశాడు.

"అమ్మ ఓసారి మురళిని రమ్మంటోంది" అన్నాడు మా చిన్నాడువచ్చి.

మురళీ నా మాటకోసమేనా చూడకుండా లోపలికి పరిగెత్తేడు.

"ఇంత రాత్రప్పుడు ఎక్కడికిరా ?" అన్నాను వాడు సైకిలేసుకు వెళ్ళబోతే. ''తెల్లారీ సరికి కాఫీపొడుంలేదుట ... అమ్మగారు తెమ్మన్నారు" అన్నాడు. ప్రైవేటు పిల్లలు గుసగుసలాడుతూ గేటవతలికి వెడుతూంటే నేను రుసరుసలాడుతూ లోపలికొచ్చాను.

"సరిగ్గా చదువుమధ్య పిలుస్తే వాడి పాఠం ఏమైపోవాలీ ? ''అంటూ.

"అమాత్రం నాకూ తెలుసు. రేపు శుక్రవారం కొట్లుండవుమరి"

"సరకు ఉండగానే ముందుగా చూసుకోవాలని ఎన్నిసార్లు చెప్పేను ?''

"ఏమో నాకు జ్ఞాపకంలేదు. పిల్లల ముందు నన్ను విసుక్కోవద్దని మీ కెన్ని సార్లు చెప్పేనో మీకూ జ్ఞాపకం ఉండి ఉండదు. పెద్దవాళ్ళం అయిపోయాం. చిన్నతనంలో ఉన్నంత జ్ఞాపకశక్తి ఉండదు మరి !''

కూరలో ఉల్లికారంకన్న మాటలో చమత్కారం రుచి ఎక్కువ. అలా వండడం మా ఆవిడకే తెలుసు. దాన్ని రుచిచూడ్డం నాకేతెలుసు. నాకు కోపం రాకపోగా నవ్వుకూడావచ్చింది. ఓగడీ ఊరుకుని అన్నాను.

"అయినా ఇది మొదటిసారి అయితే నే నేమీ అనివుండను. మొన్నపొద్దున్న ఇంగ్లీషులెసను చెబుతున్నప్పుడూ అంతే. జీలకర్రలేదని అప్పటి కప్పుడు పంపించావు. వాడికి తల్లి అన్నదిలేదనీ, వాడి అమ్మమ్మ వాణ్ణి మనకి అప్పచెప్పిందనీ నువ్వు మరచిపోయావు''

''మీరు నాకంటె పెద్దవారుగా, మీకు మరుపుశక్తి మరీఎక్కువ''

''అదేం విటి ?''

''మొన్న స్కూల్లో ఫస్టు పిరీడు ఎటెండెన్సు వేశాక సైకిలు బాగు చేయించమని మురళీధరరావుని పంపేట్టగా, నాలుగో పిరీడు వచ్చేడుట...నాకు మాత్రం ఏం తెలుసూ పిల్లలు చెబితే తెల్సిందిగాని'' నా నోరుమూత పడిపోయింది. తప్పు చేసినట్టు గడగడ వణికిపోయాను.

''అవును...నువ్వింకెప్పుడూ వాడికి పనులుచెప్పకు. నేనూ చెప్పను. ఏవిటో ఇంతమటుకు ఆలోచించలేదు నేను"

"ఆలోచించకండి ఇకముందు కూడా...అనవసరం...వాడికి ఓ ముక్క ఎప్పుడయితే మీరు చెప్పారో ఓ పని కూడా చేయించుకునే, అధికారంకూడా మీకుంది. అదేం పెద్ద అపరాధంకాదు. గురుసేవ చెయ్యడం మన శిష్యులకేం సాంప్రదాయ విరుద్ధంకాదు ... అయినా మీకా భేదబుద్ధి దేనికీ ? మన పిల్లలికి మనవేంపన్లు చెప్పడంలేదూ ?




"ఈ బ్లేడు వాడిచూడండి ! మీబుగ్గలు పాలరాళ్ళవుతవి."
"అలాగా !, అయితే ముందు మీరు వాడిచూడండి."

నాకిది సబువుగా ఉన్నట్టే తోచింది. మళ్ళీ మాట్లాడలేదు.

* * *

క్రమంగా మురళి మా యింట్లో మరీ చనువుగా మసలడం ప్రారంభించాడు. మా చంటిది ఆండాళ్ళు వాడిదగ్గరే బాగా అలవాటైపోయింది. నేనెప్పుడు బజారు కెళ్ళినా వెనకాలవాడు సంచీపట్టుకుని సిద్ధమయేవాడు. రాత్రి నేను మంచాలు వీధిలో పడేస్తూంటే 'నేనుండగా మీరువెయ్యడమేమిటి మేష్టారూ?' అని అడ్డుపడిపోయేవాడు. మా ఆవిడ క్యాజువల్ లీవ్ పెట్టిన మూడురోజులూ స్కూల్లో ఎటెండెన్సు వేసుకుని యింటికి వచ్చేసి గబగబా నీళ్ళు తోడేసి బియ్యంకడిగి స్టౌమీద పడేసేవాడు.

కొన్నాళ్లకివాడు మాఆవిడకి పెర్సనలు అసిస్టెంటూ, నాకు కుడిచెయ్యీ అయిపోయాడు. మా వాళ్ళు ఎవరైనా రైలుకి వెళ్ళినా వచ్చినా వాణ్ణే పంపేవాళ్ళం. స్వతహా చురుకైనవాడూ తెలివైనవాడూ అవడంచేత బట్టలు యిస్త్రీ చెయ్యడం లైటు ఫ్యూజు వెయ్యడం యిలాంటిపన్లలో నాకెంతో సహాయంగా ఉండేవాడు. మా ఆవిడ్ని పుట్టింటికి పంపినప్పుడు వీడినీ పంపించాను. నేను ఎలక్షన్లకి డ్యూటీమీద వెళ్లినప్పుడు వీడినీకూడా తీసికెళ్ళేను.

ఎప్పుడయినా వాడి అమ్మమ్మవచ్చేది.

"పిల్లాణ్ణి తీసుకెళ్ళి ఆ అయ్యకి అప్ప చెప్పేను. పాపమయినా పుణ్యమయినా మేష్టర్గారిదే" అని ఆవిడ అని ఉంటే నా మనసు 'రియాక్షను' మరోలా ఉండే దేమో. "వాడు మహా అదృష్టవంతుడు కాబట్టి అలాంటి ధర్మరాజు శిష్యరికం లభించింది — నాకింకేం కావాలి ?" అనేది ఆమె. కాబట్టి నన్ను నేను 'చెక్' చేసు కోవలసిన అవసరం నాకేంలేకపోయింది. 'వాడిచేత మనం ఊరికే యేం చేయించు కోడంలేదు..నేనుమాత్రం ఊరికే ప్రైవేటు చెప్పడంలేదా ఏమిటి ?' అని సరిపెట్టుకునే వాణ్ణి. 'రెండేళ్ళలో స్కూలు ఫైనలు అయి పోతుంది. తెలిసినవాళ్ళని పట్టుకుని ఏ ఎల్ డీసీ కిందో తోయించేస్తే మనభారం తీరుతుంది' అనుకునేవాణ్ణి.కాని నేను అను కున్నది ఒకటీ, జరిగినది ఒకటీ..బాధ్యతా రహితులైన వైద్యులు రోగుల ప్రాణా లతో ఆటలాడినట్టు బాధ్యతా రహితులైన ఉపాధ్యాయులు బాలుర మనస్తత్వాలతో ఎలా ఆడుకుంటారో అన్నీ అయిపోయాక గాని నేను గ్రహించలేదు.

'యాన్యువల్ ఎగ్జామినేషన్'లో వాడి లెక్కలూ, సైన్సు పేపర్లు నాకు వచ్చాయి. కాస్త అటూ యిటూ సవరించి ప్యాసు మార్కు కిట్టించాను. సోషలు అనుకున్నవి అనుకున్నట్టు పడ్డాయి. నాల్గోవంతు రాసినా ప్యాసుకి ఢోకా ఉండదు. తెలుగు వాడికెప్పుడూ డౌటు లేదు. ఇంగ్లీషు దిద్దిన కమలాకరంగారికీ నాకూ అనేక మొహమాటాలున్నాయి. ఆయనతో చెప్పేను. నా మాట ఆయన కాదననూ లేదు. అయినా యీ మాత్రం ఇచ్చి పుచ్చుకోడాలూ, సహకార ఉద్య మాలూ లేందే ట్యూషన్లు నడవవు. ఇదేం పెద్ద రహస్యమూ కాదు.

వాడు ప్యాసయినాడని తెలిసిన నాడు వాడిమాట అలా ఉంచి నా మటుకు నా కది విజయంగా ఏమీ తోచలేదు.

"ఎందుకండీ అలా బాధపడతారు ? ఇంతకంటె ఎవరేం ఉపకారం చెయ్య గలరు ? ఇవాళ ఆ ముసిలావిడ వచ్చి మిమ్మల్ని ఎంత దీవించిందో మీకేం తెలుసు ?"

మా ఆవిడ మాటలు నాకేం ఉపశమనం కలిగించలేదు.

"పోన్లే...జరిగిందేదో జరిగింది... అన్ని పనులూ వాడే చేస్తూంటే మన పిల్లలు అట్నించి యిటు కదలక ఉత్తి బద్ధకస్తుల్లా తయారవుతున్నారు...వాడు చదువు కోసం వచ్చాడు—దాని గొడవేదో ఒదిలిపోయింది. వాడ్ని ఇవాళే పంపే స్తాను. అంతగా అవసరమైతే వేసవి కాలం సెలవులు అయాక వస్తాడు" అన్నాను నేను.

"అలాగే......పిల్లలు కులాసాగా ఉండడం మీకంత అయిష్టంగా ఉంటే ఆ కుర్రాణ్ణి తక్షణం మానిపించెయ్యండి. వాడిచేత చేయించుకోడం నాకూ కష్టం గానే ఉంది...నెలకి పదిహేను రూపాయి

లిచ్చి ఓ పని కుర్రాణ్ణి పెట్టండి. యీ పిల్లల్తో నేనూ యీదలేకుండా ఉన్నాను".

"బాగుంది జీతాలిచ్చి పని కుర్రాళ్లను కూడా నే నెక్కడ పెట్టగలను? మళ్ళీ బళ్లు తెరిచేదాకా ట్యూషన్లు కూడా రావు!"

"అయినా మీదంతా చిత్రంగాని ఆ కుర్రాడు కూడా అంత నిష్ప్రయోజనంగా పనులు చేసి పెట్టడం లేదు. ఏ సామాను తెమ్మన్నా ఏ అణావో బేడో కమీషన్ కొడుతూనే ఉంటాడు!''

నా కిదొక కొత్త ఇన్ఫర్మేషను!

''ఇన్నాళ్లూ నాతో ఎందుకు చెప్పేవు కావు?''

"పెద్ద చెప్పడాని కేముంది. మన పెద్ద వాళ్లు బేడిచ్చి కారప్పూస తెమ్మంటే అణా కారప్పూస దార్లోనే ఆరగిస్తారు. ఎవరైనా అంతే. మీరు ఊఁ బాధ పడ్డం మాత్రం అనవసరం అని చెబుతున్నాను. అదిగాక యింట్లో ఏం మిగిలినా నేను వాడికి పెడుతూనే ఉంటానాయె.''

పోనీ ఆ ముసిలావిడయినా వద్దంటుం దేమో అని చూశాను.

''ఇన్నాళ్లూ అన్ని విధాలా మీరే అయి మధ్యలో కాదంటే మేం ఏమయి పోవాలి బాబుగారూ! వాడు లెక్కల్లో వెనకబడి ఉన్నాడన్నారు. ఈ సెలవుల్లో మీకూ కావలసినంత టైం ఉంటుంది గనక ఓ ముక్క చెప్పొచ్చు బాబూ! ఇంటిదగ్గిర వాడేం చెయ్యాలి గనక, పిన్నికి అవీ యివీ తెచ్చిపెట్టడమేగా! మీ దగ్గిరుంటే కాస్త భయభక్తుల్తో ఉంటాడు''. ఇక నేను కాదనడాని కేమీ లేకపోయింది.

* * *

సెలవులకి సెలవులిచ్చేసి మళ్ళీ బళ్లు తెరిచేసరికి మురళి మా యిద్దరికే కాక మా అయిదుగురిపిల్లలికీ తలలో నాలిక అయిపోయాడు. ఇంట్లో వాడు తిరగని స్థలం లేదు. వాడు ఎరగని విషయం లేదు. వాడు చేసిపెట్టని పనిలేదు. మా ఆవిడకి స్టౌలో కిరసనాయిలు పోసిపెట్టేది వాడే. మా పద్మకి పెన్ కడిగి యింక్ పోసి యిచ్చేది వాడే. మా పెద్దాడ్ని సాయంకాలం గ్రౌండకి తీసికెళ్లేది వాడే. మా చిన్నాడిని సైకిలు మీద ఎక్కించుకు తొక్కేది వాడే. ఆఖరికి మా ఆండాళుతో ఆడేదీ అడుకునేదీ వాడే. నా సైకిలు తుడిచి పెట్టేదీ వాడే.

వాడికి లెక్కలు చెబదామని నాకు మంచి ఉద్దేశమే ఉన్నా స్కూలు పేపర్లూ టేబ్యులేషన్ వర్కుతో నాకు తీరిక దొరికింది కాదు. ఇంటిపనులతో వాడికీ కుదిరేది కాదు. ఇద్దరూ కూచుని చదివే వేళకి 'సుబ్బారావుగారూ!' అనుకుంటూ నాకోసం ఎవరోవచ్చేవారు. లేదా మధ్యలో వాడి కేదైనా పని తగిలేది. ఇలా సెలవులు అయేసరికి వేరే బుక్ కుట్టించి పదేళ్ళ లెక్కల పేపర్లు వాడిచేత అన్సరు చేయిద్దామన్న నా కోరిక ఆదిలోనే ఆగి పోయింది.

ఓ సారి నాచేతి మడతలో ఉన్న అయిదు రూపాయిలనోటు కనిపించలేదు. 'ఎక్కడో పడిపోయి ఉంటుంది — లేదా ఏ దాసీదాని కళ్ళనయినా పడితే తీసి దాచేసి ఉంటుంది.' అనుకున్నాను. మరోసారి మా ఆవిడ అలమారులో పెట్టిన రూపాయీ, చిల్లరా అక్కడకక్కడే మాయమయ్యాయి. 'అయినా తీసిఉన్న అలమారలో పెట్టడమేమిటీ మతిలేకా ?' అని విసుక్కున్నాను. తక్కువడబ్బు కనక మరో ఖర్చుపెట్టి మరచిపోయి ఉంటామనుకున్నాము.

అవాళ సాయంకాలం — ఆ మునిల్దాన్ని — అలా సంతోషంగా కలుసుకోడం ఆఖరు సారనుకుంటాను...రోడ్డు మీద కలుసుకున్నాను. 'ఎంత మంచి మనసుబాబూ మీది ! జీతం లేకుండా ప్రైవేటు చెప్పి పైకి తీసుకరావడమే కాకుండా...వాడిచేత ఆ పనీ యీ పనీ చేయిస్తున్నామని రుణం ఉంచుకోకుండా అప్పుడప్పుడు ఖర్చుకి చిల్లరడబ్బులు కూడా యిస్తున్నారా ?' అని అంటూంటే నా కాశ్చర్యంవేసింది.

"నేనేం యివ్వలేదే !"

"మీరు కాకపోతే అన్నపూర్ణమ్మగారు అయుంటారు. పెద్దమనసుగల వాళ్లు; మీకివి చిన్నదానాల్లా కనిపించి ఉంటాయి. పైకి చెప్తారా, గుప్తదానం చేసేవాళ్ళు.'' అంది.

అవును.అన్నపూర్ణే యిచ్చిఉంటుంది. నాకు నాలా సంతోష మనిపించింది. ఇంటికెళ్ళి అడుగుదామను కున్నాను గాని ఏదో ధోరణిలో మరచిపోయాను. తెల్లవారి అడుగుదామను కున్నాను. తెల్లారేసరికి అడగవలసిన అవసరమే లేకపోయిందనుకో.

* * *

రోజూ మా యింట్లో ముందుగా నిద్రనుంచి లేచేది మురళీయే. 'యాన్యువల్' పరీక్షల్లో తెల్లారగట్లే లేపడం వాడికి అలవాటుచేశాను. అప్పట్నుంచే ఆ అలవాటు పోడిగించబటి పొద్దుటే దాసీ మనిషికి తలుపుతియ్యడం, పాలవాడి దగ్గర పాలు పోయించుకోడం వాడి డ్యూటీగా మారింది. అయితే ఇదంతా సాధారణంగా అయిదున్నరా ఆరూ మధ్య జరుగుతుంది. సరిగ్గా ఆరింటికి అయిదు నిమిషాలు అటూ యిటూగా మేమిద్దరం కూడా లేచిపోతాం. మా గదికి అవతల హాల్లో మురళీ, పిల్లలూ పడుకుంటారు... మా రెండు గదులకూ మధ్య సాధారణంగా గడియపెట్టుకోం. మా పడకగది పక్కగదే మా డ్రాయింగురూం. అందులోనే ఓ పక్కగా మాకు యీ మధ్యవచ్చిన గాడ్రేజ్ సేఫ్ ఉంది. దాని తాళాలగుత్తి నా తలగడక్రింద పెట్టుకోడం నాకు అలవాటు.

ఆవాళ తెల్లవారుఝామున సుమారు అయిదింటికి జరిగిందనుకుంటాను యీ

సంఘటన. గాడ్రెజ్ తలుపుతెరచినట్టు చప్పుడై ముచ్చెమటలుపోసి మెలుకువ వచ్చేసింది ... తలగడాకింద చెయ్యిపెట్టి చూశాను. తాళాల గుత్తిలేదు !

గబుక్కున లేచాను. ఒంటిగా డ్రాయింగురూంలోకి వెళ్ళడం మంచిది కాదని మురళిని లేపుదామని అడుగులో అడుగు వేసుకుంటూ హాల్లోకి వచ్చి చూశాను. గోడని జీరోవాల్ట్ బల్బువెలుగుతూనేఉంది ; మురళి పక్కమీదలేడు ! నాగుండె అతివేగంగా కొట్టుకుంది. ఏమైతే అయిందని చేత్తో ఓ కర్రతీసుకుని నా గదిలోంచి డ్రాయింగురూంలోకి వచ్చి స్విచ్ వేశాను. బీరువాని తాళాలు వేళ్లాడుతున్నాయి. వీధివైపు తలుపుమాత్రం తెరచిఉంది. అలా హాల్లోకివచ్చాను. మురళి పక్కమీద ఉన్నాడు !

తొందరగా మళ్ళీ గాడ్రెజ్ దగ్గరకి వెళ్ళి లోపలి సొరుగుతీసి చూశాను. నగలూ సొమ్మూ అన్నీ ఆతృతగాలెక్కపెట్టిచూశాను. ఎక్కడివక్కడఉన్నాయి. వీధిగేటు దగ్గిరకు పరుగెత్తుకువెళ్ళేను, ఎప్పట్లా తాళంవేసిఉంది ! స్పష్టంగా తెలుస్తోంది మురళీధరరావు నా తలగడకింద తాళాలగుత్తి తీసి గాడ్రెజ్ తెరిచాడు !! నేను లేచానని అలికిడి అవగానే ఏమీ ఎరగనట్టువెళ్ళి ఎప్పట్లా పడుకున్నాడు!! ఎంతపని చేశాడు !!!

ఒక్కనిమిషంలో నా బుర్రలోకి ఎన్ని రకాల ఆలోచనలు వచ్చాయో చెప్పలేను. వీడినిప్పుడు ఏం చెయ్యాలి ? వెంటనే పోలీసుస్టేషనుకి ఫోన్ చేసి అరెస్టు చేయించనా ? ఇంటిల్లిపాదినీలేపి వీధిలో నలుగురికీకూడా వీడిదొంగతనం వెల్లడి చెయ్యనా ? వాణ్ణేలేపి ఎడాపెడా నాలుగు చావగొట్టి నిజం చెప్పించి గుప్‌చుప్‌గా తగిలెయ్యనా? ఏంచెయ్యాలిప్పుడు? ఇప్పుడేం చెయ్యాలి ? ఇంత తొందరగా ఓనిర్ణయానికి రాగలశక్తి ఉందనికూడా నాకు తెలీదు. అప్పటికే వెలుగువస్తోంది;ఆలశ్యమైతే అన్నపూర్ణా, పిల్లలూ లేవొచ్చు. ఇది నాకూ వాడికీతప్ప రెండోకంటివాడికి తెలియడం నాకిష్టంలేదు. ''మురళీ, మురళీ ...లే" వాణ్ణి తట్టిలేపాను. ఒళ్ళు ఒణుకుతోంది. లేచి తలొంచుకు కూచున్నాడు.

"లేచి నాతో పెరట్లోకి రా" అన్నాను అధికారపూర్వకంగా.. మంత్రముగ్ధుడిలా నన్ను అనుసరించాడు. కొంచెం దూరంగా ఓ చోట ఆగమన్నాను.

"ఇంట్లో నీ సామానులంటూ ఏం వున్నాయ్ ? ఇలా వెంటనే తీసుకురా"

"ఎందుకండీ ? ఏం చేస్తారండీ ?"

ఒణికిపోతూ మాటలు మింగేస్తూ అన్నాడు.

''మాట్లాడకు — ముందు తీసుకురా" వెంటనే పరుగెత్తుకువెళ్ళి తీసుకొచ్చాడు. వాడికి పెద్దసామాన్లేమిటిగనక ? ఓ సంచిలో పుస్తకాలూ, చంకలో పక్కగుడ్డాను.

"మురళీ ... వీలయినంత తక్కువ మాట్లాడ్డం, వీలయినంత తొందరగా

నువ్వీక్కడ్నుంచి వెళ్ళిపోడం ముఖ్యం.. నీ ప్రవర్తన నాకు నచ్చలేదు. ఏమని అడిగి కఠినమైన మాటలు నా నోటినుండి రానియ్యకు ... నీకిక యీ యింట్లో స్థానం లేదు...వెంటనే యిక్కణ్నుంచి వెళ్ళిపో ...యింకెప్పుడూ మా యింటికి రాకు... ఎక్కడున్నా మంచివాడవు అనిపించుకో. ఇలాంటి పాడుపనులు మాత్రంచెయ్యకు.. ఊఁ వెంటనే వెళ్ళిపో...'' నేనీ మాటలన్నీ ఎంత కఠినహృదయంతో అన్నానో ఎంత 'రిస్ట్రెయింట్' ఉపయోగించి అన్నానో నాకేతెలీదు. నేనీమాటలు అంటున్నప్పుడు వాడిమొహం ఎలాఉందో నాకు తెలీదు ... నేను వాడివైపు చూడలేక మొహం అటుతిప్పుకుని మాటలాడేను.

వెధవ, ఎంత పనిచేశాడు! ఆ మధ్యజరిగిన దొంగతనాలూ వీడిపనే! ఇంకానయం, చూశానుగాని ... యివాళ యింట్లోఉన్న బంగారమూ డబ్బూ పూర్తిగా 'లూటీ' అయిపోనే! ఎంత గుండెలుతీసిన బంటు కాకపోతే తిన్నింటివాసాలే లెక్కెడతాడా? ఏకంగా యిన పెట్టెకే కన్నం పెడతాడా? ఆదరించిన వాడినే దోచుకుంటాడా? వీణ్ణెంచేస్తే పాపముంది? తెలిసినవాడుగదా అని యింట్లో తిరగనిస్తే ఎక్కడేముందో అన్నీ తెలుసుకుని యింతటిద్రోహం తలపెడతాడా? కట్టుకున్న పెళ్ళాంతోనయినా చెప్పకుండా, ఒంటిని ఒక్కదెబ్బ వెయ్యకుండా మరోడు అయితే యిలా సాగనంపేవాడేనా?

వాణ్ణి చూడాలనిపించింది. గబ గబా డాబామెట్లు రెండెక్కి చూశాను. అప్పటికి చాలావరకు తెల్లారిపోయింది...వెనక్కి వెనక్కి తిరిగి చూసుకుంటూ వెళ్ళలేక వెళ్ళలేక ముందుకి అడుగులు వేస్తున్నాడా పదహారేళ్ళుదాటని పసివాడు! నా హృదయం ద్రవించిపోయింది. నా కన్నులు తడిసిపోయాయి. నాకే ఆశ్చర్యం వేసింది. ఆ గజదొంగకోసం విచారిస్తున్నానా! వాడు చేసింది చాలా పెద్ద నేరం కావచ్చు...కాని వాడు పసివాడు! తల్లిప్రేమను నోచుకోలేని అభాగ్యుడు! నేను? ఎదురుప్రశ్న వేసింది మనస్సు. తిరగబడి అడిగింది నాలోని మానవత్వం. 'పదిమందికి నీతిపథాలుచెప్పే పంతులయ్యా. ఆకుర్రాడు మీ యింటికెందు కొచ్చాడయ్యా? నువ్వు నేర్పిందేమిటయ్యా? చెప్పవేమయ్యా?''

నా గుండె ఝల్లుమంది. సిగ్గుతో భూమిలోకి క్రుంగిపోయింది. ఒక నిమిషంలోనే ఒక వందసార్లు ఆ ప్రశ్న నా చెవిలో మ్రోగింది. ఆకుర్రాడు ఆశించిందేమిటి? అందుకున్నదేమిటి?

'ఏం! వాడికి నేనేమీ చెయ్యనేలేదా? తల్లిలేనివానికి నేను ఆశ్రయమివ్వలేదా?'

'వాడికి నువ్వు తల్లిలేని లోటు తీర్చేవా? ఏణ్ణర్థం క్రిందట చదువు కోసమని వాడి అమ్మమ్మ వాడ్ని

నీ దగ్గరచేర్చింది. గుండెమీద చెయ్యి వేసుకుచెప్పు...వాడు వచ్చిననాటికీ యిప్పుడునువ్వు పంపించేసిన నాటికీ ఒక్క అక్షరంముక్క అదనంగా వాడికొచ్చిందా ?'

'బాగుంది దానికి నేనేంచెయ్యను ? వాడికసలు చదువుకునే గీతలేదు. నేర్చుకుందామని ఏ కొంచమైనా ఉంటేగా ?'

'సిగ్గులేదా ఈ జవాబు చెప్పడానికి ? వాడికి చదువుకునే గీత లేదని నీకు ముందే తెలుస్తే వేసవికాలం సెలవుల్లో కూడా నీ దగ్గర ఎందుకుంచుకున్నట్టు ? చదువుకునే కోరికే వాడికి లేకపోతే అదే నీ కుర్రాడయితే అలా వదిలేస్తావా ? నీ ప్రయత్నం లోపం లేదని త్రికరణ శుద్ధిగా చెప్పగలవా? వాణ్ణి కూలి వెధవని చేసి క్లాసులోనయినా కూచోకుండా నువ్వూ, నీ పెళ్లాం, నీ పిల్లలూ పనులు చెప్పి ఇంకా సిగ్గులేక తల్లిలేని లోటు లేకుండా ఆశ్రయ మిచ్చారంటున్నావా ? రాత్రి వాణ్ణి ఎందుకు పడుకోబెట్టుకున్నట్టు? వాడి అమ్మమ్మనీ అంతకంటె వాజెమ్మ అయిన లోకాన్నీ మోసపుచ్చగలవుగాని నీలోని 'జేజెమ్మ'ను మోసగించగలవా? రాత్రి మీ యింటి తలుపులూ ద్వారబంధాలూ అన్నీ గడియాలూ తాళాలు వేసి మీ యింటి ముందు కుక్కలా పడుకోవాలా ? పొద్దుటే మీకు మెలకువైనా రాకుండా లేచి దాసీదానికి తలుపు తియ్యాలా ? ఏం, వాడికంటె చిన్నా పెద్దా ఏడుగురు మీ యింట్లో ఉన్నారే ! ఇంతమంది కాళ్లూ చేతులూ ఒక్కసారే పడిపోయాయా ? మీ పనులు మీరెందుకు చేసుకోరు ? వాడెందుకు చెయ్యాలి ? మీరిచ్చే ప్రతిఫలం? ఇదేనా ఆశ్రయానికి అర్థం ?'

నేను రెండు చెవులూ మూసుకున్నాను...ఆ ప్రశ్నల వర్షం ఆగలేదు. 'వాడు ఏణ్ణర్థం మీ యింట్లో యించుమించు మీతోనే ఉన్నాడు...వాడు దిక్కులేనివాడే కాదు, డబ్బులేని వాడు కూడా. మీతో సమంగా ఒక్కనాడేనా చూశారా? మీరు పండుగలకి కొత్త బట్టలు కుట్టించుకున్నప్పుడు వాడికి ఒక పాత జతేనా యిచ్చారా ? మీ రందరూ సినిమాకి కుర్చీకి వెళ్ళినప్పుడు వాడికి నేల టిక్కెట్టయినా కొన్నారా? మీరందరూ పరమాన్నాలు త్రాగిన ప్రతిరోజూ గుర్తించుకుని వాడికి గ్లాసుడు పాలైనా అందించారా?... ఇవేవీ ఒద్దు. వాడికీ కొన్ని అవసరాలుంటాయనీ, మనిషి బీదఅయినా మనసు బీదకాలేదనీ...వాడికీ డబ్బు అవసరం ఉంటుందనీ గుర్తించావా ? గుర్తిస్తే నెలకి ఒక రూపాయి, ఒక్కరూపాయేనా వాడికి పై ఖర్చు కిచ్చావా ?'

"వస్తూనే ఇచ్చిన అయిదురూపాయిలూ కాదని కొత్తచొక్కా, నిక్కరూ కుట్టించలేదా ?"

'అవును...ఆ రూపాయిలు నువ్వే కష్టపడి సంపాదించినవి కదూ ? నీవే

కదూ ? పోనీ అదే మంచిపని అనుకుంటే నువ్వు మొదట్నుంచి చివరవరకు చెప్పుకోదగ్గది అదే అయితే...అయినా అదికూడా ఆ అమాయక ప్రాణాన్ని ఎన్నివిధాల ఆకర్షించిందో ఎన్ని ఆశలకి లోనుచేసిందో నీ ఆలోచనకి అందేది కాదేమో... లేనిపోని ఆశలుచూపించి బానిసకన్న కనాకష్టంగా వాడుకుని ఈనాడు ఎటూకాకుండా వాడి గొంతుక కోశావు. ఇదేమయినా బాగుందా ? నీ కడుపున పుట్టినవాడే అయితే యిలాగే చేస్తావా ?"

నాకు ఒళ్ళుమండింది. నామీద నే నే విసుక్కున్నాను.

'అస్తమానం 'నీ కొడుకయితే యిలా చేస్తావా ?' అని అడగడం ఏం సబువు ? ఎవరయితేమాత్రం వాళ్ళ పిల్లల్తో సమానంగా చేస్తారా ఏమిటి ? ఇనప్పెట్టి కొల్లగొట్టబోయిన నేరాన్ని కూడా క్షమించి వదిలెయ్యడం నిజంగా ఆ కుర్రాణ్ణి అభిమానించబట్టేకదా ?''

"కాదు...నీ నేరాన్ని నువ్వు కప్పు పుచ్చుకోడం కోసం ... విద్యార్థిగా మీ యింటికి వచ్చిన వెర్రివెధవని మీహోదా, నువ్వు అనుభవిస్తున్న గొప్పదనం చూపించి మోసపుచ్చావు. అలాబతకాలనీ, నీ పిల్లలకి అయిదుగురికీ ఉన్న కనీసపు సుఖం తనకూ ఉండాలనీ, నిత్యంచూస్తున్న ఆకుర్రాడు ఆశించడం నేరమా? అవకాశం వస్తే వాటిని పొందగోరడం ఘోరమా?'

ఆ ప్రశ్నకు జవాబుతోచకపోగా వంద లాది పిల్లప్రశ్నలు కూడా పుట్టుకొచ్చేయి. నాతోపాటు సమాజంలో నాలాంటి వాళ్ళం దర్నీ కూడా అవి వెక్కిరించాయి.

"అవునుమరి ... మీరుగొప్పవాళ్లు.. మీ పనులు మీరు చేసుకోలేరు. శ్రమలోని సౌందర్యం అంటే ఏమిటో మీకుతెలీదు.. ప్రతి చిన్నపనికీ మీకు పనిమనుషుల సహాయంకావాలి ... వాళ్ళని హద్దులో ఉంచడం మీకుతెలీదు. మీరు అన్నంతిన్న వెండికంచం తోముతూంటే 'ఇలాంటిది మాకుంటే బాగుండునని' వాళ్ళనుకుంటూ ఉంటారని మీరుఅనుకోరు. మీ కాళ్ళూ చేతులూపట్టి, వేళ్ళు మెటికలు విరుస్తున్న ప్పుడు వాళ్ళదృష్టి మీ చిటికెనవ్రేలి ఉంగ రం మీద ఉంటుందని మీకుతట్టదు. వాళ్లు మీఇంట్లో ప్రతి ఖరీదయినవస్తువూ చూస్తూ లొట్టలువేస్తూ ఊరుకోవాలి. మీరుమాత్రం ఎంగిలిచెయ్యి వాడికి విదపరు. వాడు ఏ గిన్నో బట్టో ఎత్తుకుపోతే — యింక దొంగతనాలు కట్టడం పోలీసులూ, సాక్ష్యాలూ, కేసులూ, శిక్షలూ. మీ యీ చెలగాటాలకీ, స్వైరవిహారం చేస్తున్న మీ బద్ధకాలకీ మీరు కల్పిస్తున్న ఈ ఆవ కాశాలకీ బాధ్యులు మీరుకారా ? దొంగల్ని తయారు చేసే కార్ఖానా వేరే ఉందా ?'

నేనిక ఓర్చుకోలేకపోయాను. లోపలికి వెళ్ళి అన్నపూర్ణని లేపేశాను. మురళి విషయం దాన్తో ఏదోకల్పించి చెప్పా వనుకో, అదివేరే విషయం. జరిగిందేదో

జరిగిపోయిందని వాడు నా మనసులోంచి తొలగిపోవడం జరిగే విషయం కాదుగాని.. నేను వాణ్ణి పంపించేసిన తీరుమాత్రం నాకు కొంతయినా మనశ్శాంతి నిచ్చింది. 'నేరస్థుణ్ణి — వాడు నా దగ్గిరకి వచ్చింది ఒకందుకూ, నేను నేర్పింది మరొకటీ.. నాకెలాగా నిష్కృతిలేదు — నువ్వేనా ఆ దిక్కుమాలినవాడి దిక్కుచూడు తండ్రీ' అని భగవంతుణ్ణి ప్రార్థించాను. కాని అలా కూడా జరగలేదు. ఈ నాడు వాడు నా ముందు నుంచి ఏడుస్తూ వెళ్ళేడు. జేబుకొట్టి జెయిలుకి వెళ్ళేడు. ప్రపంచం దృష్టిలో వాడు నేరస్థుడు, నేను గౌరవనీయుణ్ణి!''

* * *

సుబ్బారావు ఆనాడు చెప్పుకున్న హృదయవిదారకమైన కథ నేను మరచిపోలేనిది. ప్రపంచంలో ఏంతలేసి దుర్మార్గులైనా ఉంటారన్నమాట. మళ్ళా వాణ్ణి కలుసుకోడానిక్కూడా అసహ్యం వేసింది. అవాళ నాకొచ్చిన మామూళ్ళు లెక్కచూసుకుంటూండగా రైలుకి ఫస్టు బెల్ అయింది. కనకరాజు శెట్టిగారు బండెడు సామాన్లతో సెకండ్ క్లాసు ఎక్కేరు.

"ఇదిగో టీసీ గారూ, ఈ పదీ ఉంచండి, మళ్ళీ బెడవాడ దగ్గిర గేటుదగ్గిర నన్ను ఆదుకుంటారుకదూ!" అన్నారు. ఆయన దయామయులు. 'స్వతంత్రం వచ్చిన తర్వాత రైల్లో ఫ్రీగా ప్రయాణించేపాటి స్వతంత్రమైనా లేదా?' అని ఆయన ప్రశ్న. ప్లాట్ ఫారం టికెట్ కొని ప్లాట్ ఫారంమీది కొచ్చేవాళ్ళు ఆయన దృష్టిలో పిచ్చి పుల్లాయిలు. ఇలాంటి పెద్దమనుషులు లేందే నాలాంటి పిల్లలగల వాళ్ళు ఎలాబతకాలి మరి? ★

